క్షణంలో సగం

ఒక దేశంలో పరపతి తిరపతి అని ఇద్దరు వేలువిడిచిన సోదరులుండేవారు. వాళ్ళిద్దరూ అఖండులే. తిరపతి గారు విద్యా విజ్ఞానాలలో ప్రవీణుడైతే పరపతిగారు సిరిసంపదలతో తుల తూగుతుండేవారు. తిరపతిగారికి ధనం మాన్యం, పరపతిగారు వేలిముద్రబాపతు. రాజకీయాలంటే వీశ ఎంత? అని అడిగే రకం.

వీళ్ళిద్దరూ ఒకరి పొత్తు ఒకరికి గిట్టకుండా చాలా కాలం అతికారు. అయితే పరపతిగారికి కొంతకాలానికి ఎట్లా ఎక్కిందో గాని కీర్తి వ్యామోహం అపారంగా ఎక్కిపోయింది. దాంతో అతనికి రాత్రుళ్ళు నిద్రపట్టలేదు. అన్నం సయించలేదు. కీర్తి సంపాయించడానికి అడ్డమైన సలహాలు చెప్పే వాళ్లు ఆయన చుట్టూ మూగారు.

అయితే పరపతిగారికి తిరపతిగారు జ్ఞాపకం వొచ్చి ఒకనాడు ఉన్నట్టుండి, తిరపతిగారికి ఎక్కడలేని కీర్తి ఇట్టే వచ్చి ఒళ్ళో పడిపోతోందేమిటా అని ఒకటే ఆశ్చర్య పడ్డాడు తమ్ముడు తిరపతిగారు. ఆ రాత్రే తన సొంతకారెక్కి ఊరిచివర కప్పులేని కొంపలో కూటికి మాడుతూ కాపురం చేస్తున్న తిరపతి ఇంటికి వెళ్ళాడు ఆయన.

పోతూనే ''ఏం అన్నయ్యా? బొత్తిగా మన యింటికి రావటమే లేదేం?'' అని కుశలప్రశ్న వేసి, కొంత సంభాషణ అయినాక తన కాంక్షను చాలా డొంక తిరుగుడుగా బైటపెట్టాడు.

అన్నయ్య తిరపతిగారు ఆలోచనచేసి జుట్టు రెండు మూడుసార్లు పీక్కుని చివరికి ''తమ్ముడూ నువ్వు కొంత కాలం ''ప్రజాసేవ'' చెయ్యాలోయ్. తర్వాత కీర్తి దానంతట అదే వస్తుంది'' అన్నాడు నిదానంగా.

పరపతిగారు మొహం చిట్లించి, ''ప్రజాసేవ'' అంటే అన్నయ్యా! డబ్బుతోకూడిన మాటగదా ఎలాగ!'' అని దిగులు ప్రకటించాడు.

''నీ కా దిగులక్కర్లేదోయ్ తమ్ముడు! నువ్వు డబ్బెట్టి వ్యాపారం చెయ్యడంలేదు? రూపాయికి పావలా చూసుకుని లక్షలార్జించావు. అలాంటిదే ''ప్రజాసేవ'' కూడాను. కొంత పెట్టుబడి పెట్టి ఈ 'వ్యాపారం' మొదలెట్టిచేశావూ అంటే నీ రూపాయి రెండు రూపాయలై తిరిగి వస్తుంది. పైపెచ్చు ఎంతో కీర్తి కూడాను'' అన్నాడు.

ఈ సలహాతో తన్మయుడై పోయిన పరపతిగారు ''అలాగే చేద్దాం అన్నయ్యా' మీరు మా యింటికొచ్చి వుండిపోయి నాకు వెలుగు చూపించాలి!'' అన్నాడు బ్రతిమాలే గొంతుక పెట్టి.

విద్యా విజ్ఞానా లుండికూడా దరిద్రంలో కుమిలిపోయి ఏడుస్తున్న తిరపతిగారు వెంటనే ఒప్పుకొని బైలుదేరారు.

★ ★ ★

అన్నగారి సలహా తీసుకుని పరపతిగారు 'ప్రజాసేవ,' ప్రారంభించారు. కాఫీహోటళ్ళు లగాయతు మంగలి షాపుల వరకూ కొత్తగా వెలిసే ప్రతిదాన్ని ప్రారంభోత్సవమూ పరపతిగారే చేయిస్తూ వచ్చారు. ఇటువంటివాటిని 'వార్తలు'గా ఏ పత్రికా స్వీకరించక పోవడం వల్ల వాటికి ''ప్రకటన'' రేట్లు స్వయంగా యిచ్చి ప్రకటింపచేసుకున్నారు. ప్రతి పెళ్ళి శుభలేఖలమీద ''అభినందనలతో'' లిస్టులో పరపతిగారి పేరు చేరడం ఇప్పుడు పరిపాటయింది.

ఊళ్ళో కలరా మశూచీ వ్యాపించినప్పుడల్లా శానిటరీ యిన్స్పెక్టర్లతో పరపతిగారుకూడా వుండి (వాళ్ళు పిలువనక్కర్లేకుండానే) ప్రతివాళ్ళకీ వాక్సినేషన్లు చేయిస్తూ నలుగురికీ పరిచయం అవుతూన్న పరపతిగారు రానురాను ''ఇంకా ఆ పేటలో కలరా రాలేదే! ఈ వూరికి ప్లేగు ఎప్పుడు వస్తుందీ!'' అనే చింతలో సైతం పడ్డారు. అన్నగారి ఆదేశం ఏమిటయ్యా అంటే ''ఎలాగో ముందు నలుగురికి నువ్వంటే ఎవరో బాగా తెలియాలిరా తమ్ముడూ'' అని.

వూళ్ళోవున్న ఒక ఆస్పత్రిలో పరపతిగారి పేర ఒక మంచం వేయించారు. స్కూల్లో ఐదుగురు పిల్లలకి రోజూ ఉదయం 'పిండి! పాలుపోసే ఏర్పాటు చేయించారు. ఒకవేదాంత గ్రంథానికి మహారాజ పోషకుడుగా జేరాడాయన. ఆ వూరు మాంసం మార్కెట్టును శివరాత్రినాడు 'బంద్' చేయించాడు గూడాను. ఒకరోజు జంతువధ మాన్పించారు.

ఇలాగా పరపతిగారి కీర్తి రానురాను రోజుకో నినాదంతో దిన దిన ప్రవర్థమానం కాసాగింది, చనిపోతూన్న ఒక స్థానిక మాసపత్రికకు ఆయన జీవిత చందాదారుగ్గా చేరి ఇంకో సంచిక వచ్చే ఏర్పాటుచేసి ఆ సంచికనిండా తన ఫోటోలు, తన 'ప్రజాసేవా తత్పరత' మీద వ్యాసాలు వేయించుకున్నారు. ఆ పత్రిక మరి రాలేదు. ఆ సంచికతో సరి. అయితేనేం గాక? ఎంత కీర్తి!

అన్నగారి సలహా ప్రకారం జనరల్ఎన్నికలలో పాల్గొందామని పరపతిగారు ఆశించారు. ఎం.ఎల్.ఏ. గనక అయితే తన ''ప్రజాసేవ'' కొత్తపుంత తొక్కుతుందని ఆయనకి తిరపతిగారు నూరిపోశారు. ''ఎం.ఎల్.ఏ. అంటే చదువు వుండక్కర్లేదూ?'' అని ఎవరో ఆయన్నడిగితే, నాకు చదువు రాదనేగా మీరు అనటం? మా అన్నయ్యలేడు - ఆయన అఖండ మేధావిగదా! నా వెనక ఆయనంతటి వాడుండగా నాకేం లోటు?'' అని అన్నాడు పరపతిగారు.

తిరపతిగారు రాసిచ్చిన ఉపన్యాసాలు విని బట్టీ పెట్టి పరపతిగారు ప్లాట్ఫారా లెక్కి ఉపన్యాసాలు దంచేస్తున్నారు. ఎక్కడైనా పట్టుబడితే ప్రాంప్టింగుకి తిరుపతి గారుండనే ఉన్నాడాయను.

ఎలాగో పరపతిగారు ఒకరూరల్ నియోజకవర్గం నుంచి ఎన్నికై ఎం.ఎల్.ఎ. అయి శాసనసభకు వెళ్ళారు. సగటున ఓటుకు పది రూపాయల వంతున డబ్బు మంచినీటి ప్రాయంగా ఖర్చయింది. అయితే ఏంగాక!

పరపతిగారు, ప్రస్తుతం శాసనసభలో ఏ నాడు ఏ విషయమూ ఎత్తక ప్రభుత్వ పార్టీని ప్రశ్నలతో వేధించకుండా ఏడాది పాటు కాలం గడిపేశాడు. అందకు ప్రతిఫలం మరుసటితడవ మంత్రివర్గం పునర్నిర్మించ బడ్డప్పుడు ఆయన్ని ఆర్థిక శాఖకు మంత్రిని చేశారు. ప్రభుత్వ పార్టీవారి పత్రికలు ఈ నియమకానికి హర్షం వెలిబుచ్చాయి. కారణం చదువు సంధ్యలు బాగా వుండి ఆర్థిక శాస్త్రం కంఠస్థమై కొందరు ఆర్థిక మంత్రులు ఖజానాలోని సొమ్ము దొడ్డిదోవన 'బడ్జెట్'కు అందకుండా ఓంఫట్ చేసివుండడం వల్లనూ పరపతిగారికి చదువు రాదుగనుక ఆయనకి కుయుక్తులూ, కుతంత్రాలూ, తెలీవు గనుకనూ!

కాని జరిగిందది కాదు. ఈ చాతగాని మంత్రి వెనుక తిరపతిగా రుండనే వున్నారు. ఇన్నేళ్ళుగా ప్రజాసేవ వ్యాపారం పెట్టుబడికింద అయిపోయిన డబ్బు పదింతలుగా తిరిగి వచ్చే సమయం ఇదేనని గ్రహించాడాయన. అదీగాక తిరిగి 'మంత్రి' పదవి రావటం మాటలా! పైగా తుమ్మితే తప్పు, దగ్గితే అవిశ్వాస తీర్మానం అనే ఈ రోజుల్లో గాలి వాలుగా వున్నప్పుడే సరిజేసుకోవటం మంచిది అని ఆయన విశ్వాసం.

తిరపతిగారు పరపతిగార్ని ఎంతయినా ప్రోత్సహించాడు. ఇతర శాఖల అమాత్యుల్ని చూసి గుండె దిటవు చేసుకోమన్నాడు. మంత్రివర్గమంతటా విరివిగా కన్పిస్తూన్న స్వపార్టీ స్వజన ఆశ్రిత పక్షపాతం, ధనకాంక్ష న్యాయరాహిత్యం, తనొక్కడిలో లేకపోడం క్షమించరాని దన్నాడు.

తరవాత ఏమైందో చెప్పడమెందుకు? పరపతిగారి 'ప్రజాసేవ' పెట్టుబళ్ళు పదింతలుగా తిరిగివచ్చాయి. కీర్తి దేశవ్యాపితంగా మారు మోగిపోయింది.

ఈ రకంగా పరపతిగారి పని నిత్యకళ్యాణం పచ్చతోరణంగా సాగిపోతున్నది.

మంత్రివర్గాలు మారినా తిరపతిగారి అమేయ ప్రజ్ఞవల్ల పరపతిగారికి మంత్రిత్వము సిద్ధిస్తూనే వున్నది. ఒకసారి రక్షణశాఖా మంత్రిత్వం వచ్చినప్పుడు తిరపతిగారి సలహాతో పరపతిగారు శాసన సభ్యుల్ని మంత్రుల్ని - పత్రికలుగానీ, వ్యక్తులుగానీ విమర్శిస్తే ఆజన్మాంతం కారాగారశిక్ష విధించే శాసనం చేయించారు. శాసనసభ్యులందరూ ఏకగ్రీవంగా దీన్నామోదించారు.

ప్రచారశాఖ మంత్రిత్వం సిద్ధించినప్పుడు పరపతిగారు ఇంకో తెలివైన శాసనం ప్రవేశపెట్టి గెలిపించారు. ప్రభుత్వ వ్యవహారాలన్నీ ప్రజల కంతుపట్టని ఒక పిశాచ భాషలో నడిపించాలని శాసనం ఉద్దేశం. ఆ శాసనం ముందుముందు పదిహేనేళ్ళలో అమలు జరుగుతుందని ప్రభుత్వ సంకల్పం. మొదటిమెట్టుగా రైల్వేస్టేషన్‌లలో పేర్లు పిశాచభాషలో రాయించారు.

ఇంతేగాక అదివరకువున్న రాజధాని నగరాన్ని దేశం మరొకమూల ఆనాలుగుకొండల మధ్య నీళ్ళయినా దొరకని ''నిరపాయకరమైన'' ప్రదేశంలోకి మార్చారు.

ఇన్నీ బాగా సాగినై. ఇందులో ఇంకొక విశేషం ఏమిటంటే అదివరకల్లా నిర్భాగ్యుడూ ఆగర్భదరిద్రుడూ అయిన తిరపతిగారు ఏలాగో లక్షాధికారి అయినాడు. నాలుగైదు పారిశ్రామిక గుత్తాధికారసంస్థలకు 'గౌరవ' డైరెక్టరు గూడా. 'ఇదంతా పరపతిగారి చలవలే' అని తెలియని వారన్నారు కాని నిజం పరపతిగారికే తెలుసు. తిరపతిగారు లేనిదే పరపతిగారి దేమీ లేదు.

ఒకనాడు విశ్రాంతి సమయంలో శాసనసభా విశాలమైన లాబీలలో పచార్లు చేస్తూ ఎన్నడూ ఏమీ అడగని పరపతిగారు తన పక్కనే వున్న తిరపతిగార్ని ప్రశ్నించారు అనుమానంగా. ''మనది ప్రజాస్వామిక దేశం. మన ప్రభుత్వం మన ప్రజాస్వామిక సిద్ధాంతాల్ని గురించి లక్షల కొద్ది టన్నుల పుస్తకాలు అచ్చేయించి ఇతర దేశాలకి ఎగుమతి చేస్తున్నారు గదా అన్నయ్యా! మరి మన ప్రభుత్వాలు యెన్నడైనా ప్రజల కోసం ఏమైనా చేసిన పాపాన పోయినై? ఏమిటీ సిద్ధాంతాలు?'' అని ప్రశ్నించాడు.

అందుకు సమాధానంగా తిరపతిగారు పరపతిగార్ని ఒక మూలకు తీసికెళ్ళి ''అడగవల్సిన ప్రశ్న అడిగావోయ్ తమ్ముడూ! మనది ప్రజాస్వామికపరతంత్ర వ్యవస్థ. వోటర్లు ఎలక్షనప్పుడు స్వతంత్రులూ తర్వాత పరతంత్రులున్నూ!'' అన్నాడు.

పరపతిగారు ''అరె!'' అని నోరు తెరిచాడు.

('రక్తస్పర్శ' కథల సంపుటి, 1963)